క్లుప్తంగా

కొనసాగుతున్న ప్రతిష్ఠా మహోత్సవాలు



శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలో నూతన దేవాలయాల ప్రతిష్ఠా వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామస్తులు దాతలు సహకారంతో రూ.2కోట్ల వ్యయంతో చేపట్టిన నూతన దేవాలయాలు కోదండ రామస్వామి, లక్ష్మీనరసింహస్వామి, బొడ్రాయి, జీవధ్వజ విగ్రహాలు ప్రతిష్ఠా మహోత్సవాలు ఆగమ సిద్ధాంతి వేద పండితులు శ్రీపతి అనంతచార్యులు సారథ్యంలో ప్రతిష్ఠా వేడుకలు ఈనెల 31న ఉదయం 8.12 నిమిషాలకు వైభవంగా జరుగుతాయన్నారు. ఆదివారం ప్రతిష్ఠా కార్యక్రమాల్లో భాగంగా మూడోవ రోజు విగ్రహాలకు పంచామృత అభిషేకాలు, పరిహారహోమం, శీతల యంత్రహోమాలు, క్షీరాధివాసం దంపతులచే పూజ కార్యక్రమాలు వేదపండితులు ఘనంగా నిర్వహించారు. చివరిరోజు భారీ అన్నదానం ఏర్పాటు ఉంటుందన్నారు.

గ్రామోదయం సమస్యలకు పరిష్కారం



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని ఉప్పరపాలెం గ్రామపంచాయతీలో గ్రామోదయంలో భాగంగా గత శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ పర్యటించి పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ మేరకు ఎంపీడీఓ మంగాపురనాథ్ సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించి పారిశుద్ధ్యంపై చేపట్టాల్సిన చర్యల గురించి వివరించి యుద్ధప్రాతిపదికన పనులను ప్రారంభించారు. మురుగునీరు పారుదలకు కచ్చా డ్రెయిన్స్ ఏర్పాటు చేసి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అలాగే గ్రామస్తులకు మంచినీటి సౌకర్యం కల్పించారు. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీనుబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

2వేల క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు

శావల్యాపురం: రైతుల నుంచి 2వేల క్వింటాళ్ల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసినట్లు మండలంలోని కారుమంచి గ్రామ సొసైటీ కేంద్రం సీఈఓ డి.వెంకట నారాయణ ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా సీఈఓ మాట్లాడుతూ కారుమంచి సొసైటీ పరిధిలో గుంటుపాలెం, వయ్యకల్లు, భాస్కర్‌నగర్, ధర్మపురి, కారుమంచి గ్రామాలు ఉండగా, ఆయా గ్రామాలకు చెందిన 36 మంది రైతుల నుంచి 2వేల క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేయగా 11 మంది రైతుల బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు జమ చేసినట్లు చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చిలకలూరిపేటటౌన్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని చౌత్రాసెంటర్‌లో విజయలక్ష్మి సర్వీస్‌సెంటర్ ముందు వ్యక్తి మృతి చెంది ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు శనివారం సాయంత్రం నుంచి బాగా మద్యం సేవించి అటువైపు తిరిగాడని స్థానికులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

రేపు సువార్త స్వస్థత సభ

దాచేపల్లి : నడికుడి హోసన్నా మందిర్ ఆధ్వర్యంలో సువార్త స్వస్థత సభను ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తున్నారు. హోసన్నా మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ ఈ సభలో వ్యాక్యోప సందేశాన్ని అందించి రోగుల కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేస్తారు. నడికుడి హోసన్నా మందిర్ ప్రాంగణంలో జరిగే ఈ సభకు విశ్వాసులు తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

సాతులూరులో నేటి నుంచి రీసర్వే

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో సోమవారం నుంచి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూరక్ష సర్వే పనులు ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ ఏపీ రమణ తెలిపారు. ఇప్పటికే గ్రామ సభ పూర్తయిందని, ఉదయం నుంచి మూడు బృందాలుగా రెవెన్యూ సిబ్బంది సర్వే పనులు ప్రారంభిస్తారన్నారు. రైతులకు నోటీసులు జారీ చేసి సర్వే చేస్తామన్నారు. మండలంలోని తూబాడు, గణపవరం, ఇర్లపాడు గ్రామాల్లో సర్వే పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. రైతులు సహకరించాలని, భూమికి సంబంధించిన ఆధారాలు, బ్యాంకు ఖాతా జిరాక్సు అందించాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- విప్పర్ల రెడ్డిపాలెంలో రూ.27కోట్లతో అభివృద్ధి, సంక్షేమం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



గ్రామంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: విప్పర్లరెడ్డిపాలెం గ్రామంలో గడిచిన నాలుగేళ్లలో రూ.27కోట్లతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అందజేశామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించారు. గ్రామంలో రూ.10కోట్లతో అభివృద్ధి పనులు చేయగా, రూ.17కోట్ల సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. శివాలయ నిర్మాణానికి రూ.86లక్షల నిధులు మంజూరుచేయించినట్లు తెలిపారు. రూ.19లక్షల వ్యయంతో జీబీసీ నుంచి సరాసరిగా మంచినీటి పథకానికి పైపులైను ఏర్పాటు చేస్తామన్నారు. కల్యాణ మండప నిర్మాణానికి ఎంపీ అయోధ్యరామిరెడ్డి రూ.50లక్షలు నిధులు ఇస్తుండగా మరో రూ.50లక్షలను ఇర్కో లేబొరేటరీస్ అధినేత డాక్టర్ నందిగల వెంకటరెడ్డి అందజేస్తున్నారన్నారు. అలాగే బెహరా వారిపాలెంలోని రామాలయం అభివృద్ధికి టీటీడీ నుంచి రూ.6లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. జిల్లాలో తొలిసారిగా రూ.15లక్షల వ్యయంతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశామన్నారు. రూ.16లక్షలతో మిల్క్‌చిల్లింగ్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇంటింటికి తిరిగి వారికి అందిన సంక్షేమపథకాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబులురెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, నాయకులు పడాల సాంబశివారెడ్డి కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, కసిరెడ్డి వెంకటకోటిరెడ్డి, సర్పంచు బత్తుల అంజయ్య, గుండాల వెంకటేష్, పచ్చవ రవీంద్రబాబు, దుద్దుకుంట సైదులురెడ్డి, వరికూటి శ్రీనివాసరెడ్డి, పాలిమేర శ్రీనివాసరెడ్డి, పాలిమేర వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దుద్దుకుంట యోగిరెడ్డి, గుంటక వెంకటేశ్వరరెడ్డి, బోడె సైదులురెడ్డి, గంగారపు ఓబులురెడ్డి, మానుకొండ వాసుదేవరెడ్డి, చపారపు సంజీవరెడ్డి, కాసినీడి మస్తానయ్య, తెలగనేని వెంకటేశ్వరరావు, సయ్యద్‌ఖాదర్‌బాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబుకి అధికారం లేనప్పుడే ఎన్టీఆర్ గుర్తుకొస్తాడు..

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: చంద్రబాబు నాయుడుకు అధికారంలో లేనప్పుడు, ఎన్నికలప్పుడే ఎన్టీ రామారావు గుర్తుకొస్తాడని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్‌ని పొగడ్తలతో ముంచెత్తటం చూస్తుంటే ఆశ్చర్యమేస్తోందని చెప్పారు. ఎల్లో మీడియా ఇప్పుడు ఎన్టీఆర్ ఫొటోలు పెద్దవి, బాబువి చిన్నవి వేసి చూపిస్తుందన్నారు. అధికారం ఉన్నప్పుడు ఎన్టీఆర్‌వి చిన్న ఫొటోలు, బాబువి పెద్ద ఫొటోలు చూపించేదని గుర్తుచేశారు. వెన్నుపోటు పొడవటం, వైస్రాయ్ హోటల్ ఎదుట చెప్పులు వేయటం నిజం కాదా అని ప్రశ్నించారు. దమ్ము, ధైర్యం ఉంటే ఎన్టీఆర్‌కు క్షమాపణ కోరుతూ మహానాడులో తీర్మానం చేయాలని సవాల్ విసిరారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలపై చూపిస్తున్న అభిమానం 14ఏళ్లలో ముఖ్యమంత్రిగా ఎప్పుడైనా బాబు చూపించాడా అని ప్రశ్నించారు. సీఎంగా బాబు కార్పొరేట్ వ్యవస్థలు, సంస్థలకు ప్రయోజనం చేకూర్చితే, సీఎం జగన్ పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు హర్షిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పుస్తక పఠనంపై దృష్టి సారించండి

గ్రంథాలయ ప్రచారోద్యమకర్త వెంకటేశ్వరరెడ్డి



నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు సెల్‌ఫోన్, సోషల్ మీడియా ఉచ్చునుంచి బయటపడి పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని గ్రంథాలయ ప్రచారోద్యమకర్త మంచికంటి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గ్రంథాలయ ప్రయోజనాలను వివరిస్తూ ప్రకాశం జిల్లా కొండెపి మండలం జాళ్లపాలెంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటేశ్వరరెడ్డి ఈనెల 19వ తేదీన ఒంగోలు నుంచి చేపట్టిన ప్రచారయాత్ర ఆదివారం పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయాన్ని సందర్శించిన వెంకటేశ్వరరెడ్డి వేసవి విజ్ఞాన శిబిరంలోని విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఆసక్తిని కలిగించే పుస్తకాలను చదవటం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజు ఏదో ఒక పుస్తకాన్ని చదివేలా ప్రణాళిక రూపొందించుకోవాన్నారు. విజ్ఞాన బాంఢాగారమైన గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు ఒకేచోట లభిస్తాయనీ, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథాలయాన్ని సందర్శించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



2003 పదో తరగతి పూర్వవిద్యార్థుల బ్యాచ్

పెదకూరపాడు: తమకు విద్యా బుద్దులు నేర్పిన గురువులకు, దేవాలయం లాంటి పాఠశాలకు ఆర్థికంగా తోడ్పటు అందిస్తామని 75 త్యాళ్ళూరు జెడ్పీపాఠశాలలో 2003లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు తెలిపారు. ఆదివారం 75 త్యాళ్ళూరులోని జెడ్పీ పాఠశాలలో 2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడేక్కడో స్థిరపడిన వారు తమకు చదువులు చెప్పిన గురువులు, విద్యను అందించిన పాఠశాలలను చూసి మురిసిపోయ్యారు. అప్యాయంగా పలకరింపులు అనురాగాలతో సంతోషంగా గడిపారు. ఆనాటి జ్ఞాపకాలను స్మరించుకుంటు చదువుకున్న తరగతి గదుల్లో రోజాంత గడిపారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువుతో పాటు సంస్కరణ ఉండే విధంగా దేశభక్తిని అలవర్చాలన్నారు. పుట్టిన ఊరుకు చదువులు చెప్పిన గురువులకు మంచి పేరు తెచ్చిన వారు ఉత్తమ విద్యార్థి అన్నారు. పాఠశాల అభివృద్ధికి , గురువులకు ఆర్థికంగా తమ వంతు సహాయం చేస్తామన్నారు.

కార్యక్రమంలో పాఠశాల పేరేంట్స్ కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, భవనం నర్సింహరెడ్డి, ఆర్ శివకుమారి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోలేరమ్మ కొలుపులు



పోలేరమ్మతల్లి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో పోలేరమ్మతల్లి కొలుపులు ఆదివారంతో ముగిశాయి. కార్యక్రమంలో గ్రామస్తులు పొంగళ్ళు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు, మాజీ శాసనసభ్యులు యర్రంవెంకటేశ్వరరెడ్డిలు పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పించున్నారు. సర్పంచ్ మోర్తాలవెంకటరమణారెడ్డి, ముప్పాళ్ళ సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డిసాయిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభాకరరెడ్డి, కిక్కురురామిరెడ్డి, నక్కా శ్రీనివాసరావు తదితరులు అమ్మవారికి దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జూన్ 1న కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట



రాజుపాలెం: మండలంలోని పెదనెమలిపురిలో నూతనంగా నిర్మించిన దేవస్థానంలో జూన్ 1వ తేదీన శ్రీదేవిభూదేవిసమేత శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠమహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. దీనికి గాను ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. అదే రోజు శ్రీహనుమంత్ విగ్రహం, ద్వారపాలకులు, జీవధ్వజస్తంభం, ఆలయశిఖర కలశములు ప్రతిష్ఠించనున్నారు. అదేవిధంగా శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో ధ్వజస్తంభం ముఖ్యద్వారమున శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ప్రతిష్ఠ కార్యక్రమానికి భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ



వినుకొండ(నూజెండ్ల): ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ నుంచి మహిళల ఆరోగ్యంపై మెప్మా సిబ్బంది ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, రక్తహీనతతో బాధపడకుండా ఆకుకూరలు, పండ్లు, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ షకీలా దస్తగిరి, పలువురు డాక్టర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



నాదెండ్ల: మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయటమే కాకుండా వాహనాలను సీజ్ చేస్తామని ఎస్‌ఐ ఆవుల భాస్కర్ హెచ్చరించారు. నరసరావుపేట డీఎస్పీ ఆదేశాల మేరకు గణపవరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలువురు మైనర్లు వాహనాలు నడుపుతుండటం గుర్తించి కేసులు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడపటం, పరిమితికి మించి వాహనాలపై ప్రయాణిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటం చట్టరీత్యా నేరమన్నారు. డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.

31న మాన్యం భూముల కౌలు వేలం

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు గ్రామంలో రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో పలు దేవాలయాలకు చెందిన మాన్యం భూముల కౌలు వేలం ఈ నెల 31న నిర్వహిస్తామని ఈఓ బి.శ్రీనివాసులు తెలిపారు. అదే గ్రామంలోని వేణుగోపాలస్వామికి చెందిన 18.60 ఎకరాల భూమి, పార్వతీసమేత సోమేశ్వరస్వామి దేవాలయానికి చెందిన మాన్యం 5 ఎకరాలు, గంగమ్మ అమ్మవారి మాన్యం 7 ఎకరాలు, అదేవిధంగా వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో గదుల అద్దెకు సంబంధించి వేలంతో పాటు రావులాపురంలో వేంచేసి ఉన్న మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన భూములకు వేలం ఈ నెల 31న ఉదయం 10గంటల నుంచి 11.30గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామికి చెందిన భూములు మండలంలోని రేమిడిచర్ల గ్రామపరిధిలో 4.41 ఎకరాలు, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం బీర్నీడుపల్లి గ్రామపరిధిలో 2.08 ఎకరాలు భూములకు సంబంధించి వెల్లటూరు గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వేలంపాట నిర్వహిస్తామన్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖ చట్టం నిబంధనలకు, షరతులకు లోబడి వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.5వేలు, రూ.10వేలు దరావత్తు చెల్లించాల్సి ఉంటుందని ఈఓ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

యడ్లపాడు: రోడ్డుపై ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన క్రమంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. యడ్లపాడు మండలం వంకాయలపాడు గ్రామానికి చెందిన తుమ్మలూరి రాజేష్ వ్యక్తిగత పనులపై శనివారం బైక్‌పై చిలకలూరిపేట వెళ్లి తిరిగి వంకాయలపాడు వస్తుండగా తిమ్మాపురం కల్పతరువు నూలుమిల్లు సమీపంలో ఆపిఉన్న బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో కిందపడిన అతనికి తలకు, కళ్లవద్ద, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది క్షతగాత్రుడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మద్యం సేవించి ఉన్నందునే ఈ ప్రమాదం జరిగిందని, వైద్యుల పరిశీలనలో వెల్లడైనట్లు ఎస్‌ఐ పైడి రాంబాబు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

క్రికెట్ కిట్ పంపిణీ

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు గ్రామం ఎంపీటీసీ సభ్యురాలు దావులూరు సంపూర్ణ–శ్రీనివాసరావు దంపతులు రూ. 10వేలు విలువ చేసే క్రికెట్ కిట్‌ను ఎస్సీ కాలనీలో యువకులకు ఆదివారం పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బెతాం పాపయ్య, నాగార్జున, బందెల దేవానందం పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు



కోదండ రామస్వామి దేవాలయం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కోదండ రామస్వామి దేవాలయంలో ఈ నెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు కోదండ రామస్వామివారి నూతన పంచలోహ ఉత్సవ విగ్రహాలు, హనుమత్, విగ్రహ, రాజ్యలక్ష్మి విగ్రహాలు, ధ్వజస్తంభ, రాజగోపుర ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు టీటీడీ ఆగమ పండితులు శ్రీమాన్ డాక్టర్ నారాయణం తనజ్ విష్ణువర్ధనాచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక అర్చకులు నారాయణం రామమోహనాచార్యులు పర్యవేక్షణలో జరగనున్నట్లు వివరించారు. ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 29 నుంచి 30వ తేదీ వరకు భగవత్ ప్రార్థనం, విష్వక్సేనారాధనం, పుణ్యాహవాచనం, అగ్ని ప్రణయనం, కుంభారాధనం, మహాశాంతి హోమం, మంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. చివరి రోజు 31వ తేదీన స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠతో పాటు ధ్వజస్తంభ స్థాపన, రాజగోపుర ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కోదండ రామస్వామి వారి కళ్యాణ మహోత్సవం జరపనున్నట్లు తెలిపారు. భక్తులందరికి అన్నసంతర్పణ కార్యక్రమం ఉంటుందని, భక్తులు వేలాదిగా పాల్గొని ప్రతిష్ఠా మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన లారీ



లారీ ఢీకొని దెబ్బతిన్న కారుముందు భాగం

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం ప్రధాన సెంటర్ జాతీయ రహదారి మార్గంలో ఆగి ఉన్న కారును లారీ ఢీకొట్టిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. స్థానికుల వివరాల మేరకు త్రిపురాంతకంలో వేంచేసియున్న బాలత్రిపురసుందరిదేవి అమ్మవారి దర్శనం చేసుకొని తిరిగి గుంటూరుకు బయలుదేరిన శరత్‌చంద్రబోసు కుటుంబసభ్యులు, స్నేహితులు నలుగురు కారులో వస్తున్నారు. ఈక్రమంలో శావల్యాపురం సెంటరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద కారు రోడ్డు పక్కన నిలిపారు. ఇదే క్రమంలో పిడుగురాళ్ల నుంచి బెంగళూరుకు పొడరులోడుతో వెళుతున్న లారీ అతివేగంతో కారును ఢీకొట్టింది. లారీ ఆగకుండా పోతుండగా గ్రామస్తులు కేకలు వేసి లారీని నిలుపుదల చేసి పోలీసులకు సమాచారం అందించారు. అయితే కారులో ఉన్నవారికి ఎటువంటి గాయాలు కాలేదు. కారు మందుబాగం పూర్తిస్థాయిలో దెబ్బతింది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని, వివరాలు సేకరించి లారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

కారుచోలలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలను నిర్వహిస్తున్న దృశ్యం

యడ్లపాడు: ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని షేక్ జాన్ సైదా చెప్పారు. మండలంలోని కారుచోల గ్రామం ఉర్దూ పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా కంటివైద్య శిబిరాన్ని జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సంస్థ చైర్మన్ జాన్‌సైదా ప్రారంభించిన ఈ శిబిరంలో గ్రామస్తులతో పాటు సమీప ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు. కంటికి సంబంధించిన వైద్యులు 320 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అనంతరం బోయపాలెం గ్రామంలో ఇటీవల నిర్వహించిన శిబిరంలో గుర్తించిన 125 మందికి కళ్లజోళ్లను అందజేసినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు కంజుల వీరారెడ్డి, గొంటు శ్రీనివాసరెడ్డి, జాలాది సుబ్బారావు, చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, ఈదర కోటయ్యస్వామి, బాష, కొమ్మనబోయిన రమేష్, పట్నం కరిముల్లా, కూరపాటి ఆంజనేయులు, జమ్మలమడక ఆదిబాబు, కొక్కిరి చిట్టిబాబు, బీవీరెడ్డి, కారుచోల గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా బంగారు మైసమ్మ జాతర



ప్రత్యేక అలంకారంలో బంగారు మైసమ్మ అమ్మవారు

జెట్టిపాలెం(రెంటచింతల): మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో వేంచేసిన బంగారుమైసమ్మతల్లి అమ్మవారి జాతర వేడుకలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు వడితే ముత్యాలునాయక్ నేతృత్వంలో ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి ఉదయం 6గం.లకు గంగస్నానం, 9గం.లకు కుంకుమపూజతో పాటు వివిధ పూజా కార్యక్రమాలను జరిపించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం 6గం.ల నుంచి ఏర్పాటు చేసిన మూడు కుంకుమ బండ్లుతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. గ్రామ పెద్దల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు వడితే భీమ్లానాయక్, వడితే భగ్గునాయక్, వడితే హనుమానాయక్, వడితే తులశ్యానాయక్, వడితే రామదాసునాయక్, వడితే బాలునాయక్, వడితే లింగానాయక్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైద్యశిబిరానికి విశేషస్పందన



వైద్యశిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

దాచేపల్లి : మండలంలోని తంగెడ భవ్య సిమెంట్ ఫ్యాక్టరీలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. భవ్య సిమెంట్స్ ఆధ్వర్యంలో గుంటూరు శ్రీ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. వెంకటరాజు ప్రారంభించారు. తంగెడ, ముత్యాలంపాడు గ్రామస్తులతో పాటుగా ఫ్యాక్టరీ విధులు నిర్వహించే సిబ్బందికి ఎముకలు, కీళ్లు, కిడ్నీ, షుగర్, బీపీతో పాటుగా సాధారణ రోగాలకు వైద్యులు వైద్య పరీక్షలు చేసి అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. భవ్య సిమెంట్స్ యజమాన్యం ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, భవిష్యత్‌లో మరిన్ని సీఎస్‌ఆర్ కార్యకలాపాలు కొనసాగించాలని జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి కోరారు. ఈ శిబిరంలో సర్పంచ్‌లు కొత్తపల్లి కాశయ్య, ఎన్. వెంకటచారి, ఎంపీటీసీ పాస వెంకటనాగయ్య, పోతుల ప్రసన్నకుమార్, యూనిట్ హెడ్ బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

నరసరావుపేట ఈస్ట్: ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం పల్నాడుజిల్లా అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్య విద్యార్థినికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. డిగ్రీ విద్యనభ్యసిస్తున్న చిలకలూరిపేట మండలం బొందిలిపాలెం గ్రామానికి చెందిన పేలూరి దివ్య విద్యాభ్యాసం నిమిత్తం ఈనగదు సహాయాన్ని ఆదివారం అందించారు. దాతలు అయ్యప్పస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కొత్తూరి వెంకటశివవేణుగోపాల్, సీతారామస్వామి ఆలయ ధర్మకర్త మండవ సీతారామాంజనేయులు, రొటేరియన్ కపలవాయి రమేష్‌చంద్రదత్ పాల్గొన్నారు.